పేదోడు సొంతింటి కల సాకారం చేసుకునేందుకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న కాలనీలలోని ఇంటి నిర్మాణాలు ఎక్కడికక్కడ నిలిచి పోయాయి. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత గృహ నిర్మాణాలకు ఎటువంటి నిధులు మంజూరు చేయలేదు. దీంతో కాలనీల నిర్మాణంలో ఎటువంటి పురోగతి కనిపించడం లేదు. అదే విధంగా ఇప్పటికే పలు కాలనీలలో గృహ నిర్మాణాలు పూర్తి చేసుకుని నివాసం ఉంటున్నప్పటికీ సరైన మౌలిక వసతులు లేక కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ఇంటి కల.. కల్ల

- ఎక్కడికక్కడ నిలిచిపోయిన జగనన్న కాలనీలు
- ఒక్క పైసా మంజూరు చేయని కూటమి ప్రభుత్వం
- నిర్మాణాలు పూర్తయిన గృహాలకు మౌలిక వసతులు కరవు
- ఎటూ పాలుపోని స్థితిలో లబ్ధిదారులు



అమృతపురంలో గత ప్రభుత్వంలో పూర్తయిన జగనన్న కాలనీ



ఇళ్ల నిర్మాణం పూర్తయినా పూర్తి కాని అమృతపురం కాలనీ రహదారి

మండలంలో గ్రామ పంచాయితీలు	జగనన్న కాలనీ లే అవుట్లు	లబ్ధిదారులకు మంజూరు చేసిన ప్లాట్లు	లబ్ధిదారులకు మంజూరు చేసిన గృహాలు	పూర్తయిన గృహాలు	పూర్తయిన గృహ నిర్మాణాల శాతం
24	28	2,108	1,712	787	46

సబ్బవరం: మండలంలోని పలు గ్రామాల్లో గత ప్రభుత్వంలో వైఎస్సార్ కాలనీలు శరవేగంగా నిర్మాణమయ్యాయి. దీంతో ఆయా కాలనీలలో లబ్ధిదారులు నివాసాలు ఏర్పాటు చేసుకుని ఉంటున్నారు. అయితే ప్రస్తుత ప్రభుత్వం ఆయా కాలనీలకు అవసరమయ్యే రోడ్లు, తాగునీరు వంటి మౌలిక వసతులపై దృష్టి సారించడం లేదు. దీంతో వైఎస్సార్ కాలనీల్లో నివాసం ఉంటున్న లబ్ధిదారులు ఇబ్బందులు పడుతున్నారు. అంతే కాకుండా గతంలో మంజూరు చేసిన గృహాలకు నిధులు మంజూరు చేస్తారో లేదో అన్న ఆందోళనలో లబ్ధిదారులున్నారు. ఈ కారణంగా ఆయా కాలనీల్లో సగంలో నిలిచిపోయిన గృహాలను నిర్మించేందుకు లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.



నిలిచిపోయిన గృహ నిర్మాణాలు

నాటి ప్రభుత్వంలో సాయం ఇలా..

గత ప్రభుత్వంలో గృహ నిర్మాణాలు చేపట్టేందుకు లబ్ధిదారులకు రాయితీపై 20 టన్నుల ఇసుకను ఉచితంగా అందించేవారు. దీంతో పాటు రాయితీపై ఇంటి నిర్మాణానికి 480 కిలోల స్టీల్, 100 సిమెంట్ బస్తాలు కూడా ప్రభుత్వం అందించేది. రూ.1.5 లక్షలు చెల్లించడంతో పాటు అదనంగా ఎన్ఆర్ఈజీఎస్, టాయిలెట్ల నిర్మాణానికి రూ.30 వేలు కలిపి రూ.1.8 లక్షలు గృహ నిర్మాణ లబ్ధిదారులకు అప్పటి ప్రభుత్వం సాయం చేసేది.

ఆందోళనలో లబ్ధిదారులు..

ప్రస్తుత ప్రభుత్వం ఇప్పటి వరకూ ప్రారంభం కాని గృహ నిర్మాణాల గురించి సర్వే చేసి వివరాలు సేకరించింది.

అప్పుడు మంజూరు చేసిన పట్టాలను రద్దు చేసే దిశగా ప్రభుత్వం యోచిస్తుందనే ప్రచారం జరుగుతోంది. అదే విధంగా గతంలో వివిధ దశలలో ఉన్న గృహ నిర్మాణాలను మార్చి చివరి నాటికి పూర్తి చేయాలని గృహ నిర్మాణ శాఖ అధికారులు, లబ్ధిదారులపై ఒత్తిడి తెస్తున్నట్లు తెలుస్తోంది. అయితే నిలిచిపోయిన గృహ నిర్మాణాలను తిరిగి ప్రారంభిస్తే ప్రభుత్వం నిధులు చెల్లిస్తుందో లేదో అని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక వసతులు లేక అవస్థలు..



మాది అమృతపురం శివారు చింతగట్ల అగ్రహారం. నా భర్త లారీ డ్రైవర్‌గా పని చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. గత ప్రభుత్వంలో మాకు జాతీయ రహదారికి అత్యంత సమీపంలో విలువైన స్థలం ఇచ్చారు. బహిరంగ మార్కెట్‌లో రూ.3 నుండి రూ. 4 లక్షలు పలుకుతుంది. దీంతో ఆ స్థలంలో ఇంటి నిర్మాణం పూర్తి చేయడంతో గతంలోనే ప్రభుత్వం పూర్తిగా బిల్లులు చెల్లించింది. ప్రస్తుతం కాలనీలో మౌలిక వసతులు లేక అవస్థలు పడుతున్నాం.

– **వాడిబోయిన ఉమ**, అమృతపురం జగన్న కాలనీ, సబ్బవరం మండలం.

బిల్లులు చెల్లిస్తారో లేదో..



ప్రభుత్వం గతంలో ఆరిపాక లే అవుట్‌లో స్థలంతో పాటు ఇల్లు మంజూరు చేసింది. దాంతో బేస్‌మెంట్ లెవల్ వరకూ పూర్తి చేసి పిల్లర్లు వేశాం. అంత వరకూ గతంలోనే బిల్లులు చెల్లించారు. అయితే నిర్మాణం మధ్యలో నిలిచిపోవడంతో ప్రస్తుత ప్రభుత్వం బిల్లులు చెల్లిస్తుందో లేదో అని నిర్మాణాలు ప్రారంభించలేదు. ప్రస్తుతం గృహ నిర్మాణ శాఖ అధికారులు నిర్మాణాలు పూర్తి చేస్తే బిల్లులు చెల్లిస్తామని చెబుతున్నారు.

– **లాలం మణికంఠ**, ఆరిపాక గ్రామం, సబ్బవరం మండలం.

ప్రభుత్వం విధి విధానాలు ప్రకటించాల్సి ఉంది..



గత ప్రభుత్వంలో స్థలాలు మంజూరై ఇప్పటి వరకూ గృహ నిర్మాణాలు ప్రారంభించని లబ్ధిదారులను గుర్తించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సర్వే చేసి మండలంలో పలు లే అవుట్లలో ఇప్పటి వరకూ గృహ నిర్మాణాలు ప్రారంభించని 198 మంది లబ్ధిదారులను గుర్తించి ప్రభుత్వానికి నివేదిక అందజేశాం. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి వాటిపై ప్రభుత్వం సర్వే చేసింది. దీనిపై ప్రభుత్వం విధి విధానాలను ప్రకటించవలసి ఉంది.

– **ఎంఎస్ఎస్ఎన్ రెడ్డి**, గృహ నిర్మాణ శాఖ ఏఈ, సబ్బవరం మండలం

క్లుప్తంగా

సింహగిరిపై విశేషంగా శ్రీనృసింహ హోమం



ప్రధాన కలశాన్ని శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, పాల్గొన్న భక్తులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని బుధవారం సింహగిరిపై శ్రీ నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 నుంచి ఆలయ కల్యాణ మండపంలో అర్చకులు శాస్త్రోక్తంగా హోమం నిర్వహించారు. వేదికపై చక్ర పెరుమాళ్లని అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, షోడశోపచార పూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేశారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభ ప్రోక్షణ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రధానార్చకుడు గొడవర్తి శ్రీనివాసాచార్యులు, అర్చకులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

కోలాట బృందానికి మైక్‌సెట్ వితరణ



కోలాట బృందానికి మైక్‌సెట్ అందించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు అప్పారావు

పరవాడ: మండలంలో పెదముషిడివాడ గ్రామానికి చెందిన వేణుగోపాల కోలాట బృందానికి స్థానిక సర్పంచ్ కుమారుడు, వైఎస్సార్‌సీపీ నాయకుడు పల్లా అప్పారావు రూ.15 వేల విలువ కలిగిన మైక్ సెట్, చీరలు సమకూర్చి కోలాట బృందానికి బుధవారం వితరణగా అందజేశారు. అనంతరం అప్పారావు మాట్లాడుతూ సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను ప్రదర్శిస్తూ గ్రామానికి మంచి పేరు తీసుకు రావడానికి కోలాట బృందం సభ్యులు కృషి చేయాలని కోరారు. కోలాట బృందానికి అవసరమైన సేవలు అందించడానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు, కోలాట బృంద సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పరవాడ: వాడచీపురుపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో పలు చోట్ల జంగిల్ క్లియరెన్స్, మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.రామకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఫలితంగా వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, ముత్యాలమ్మపాలెం, తిక్కవానిపాలెం పరిసర గ్రామాలకు విద్యుత్ సరఫరా ఉండబోదని ఆ ప్రకటనలో తెలిపారు.

కబడ్డీ పోటీల పోస్టర్ ఆవిష్కరణ

గాజువాక: అనకాపల్లి జిల్లా అంకుపాలెంలో ఈనెల 25 నుంచి మూడు రోజులపాటు నిర్వహించనున్న 71వ అంతర్ జిల్లాల మహిళా, పురుషుల కబడ్డీ పోటీల పోస్టర్‌ను ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల పట్ల యువత ఆసక్తి చూపుతున్నారన్నారు. కబడ్డీ అసోసియేషన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఉరుకూటి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని అన్ని జిల్లాల నుంచి సుమారు 500 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కబడ్డీ అసోసియేషన్ ప్రతినిధులు ప్రసాదుల శ్రీను, వి.బాబూరావు, ఎం.ఉమాశంకర్‌బాబు, పి.అప్పారావు దాస్, పి.వి.రమణ, పి.సత్యనారాయణ, వి.కృష్ణ పాల్గొన్నారు.

లీజు హక్కుల కోసం బహిరంగ వేలం పాటలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో వ్యాపారాలు చేసుకునే నిమిత్తం లీజు హక్కులు ఇచ్చేందుకు బుధవారం బహిరంగ వేలం పాటలు నిర్వహించారు. కొండ దిగువ తొలి పావంచా వద్ద భక్తులు కొట్టిన కొబ్బరికాయ ముక్కలు తీసుకునేందుకు ఏడాది కాలానికి నిర్వహించిన బహిరంగ వేలం పాట రూ. 30 లక్షల 60 వేల 999 హెచ్చు మొత్తానికి వెళ్లింది. అలాగే పూరూరవ సత్రంలో మూడు షాపులను అద్దెకు ఇచ్చేందుకు నిర్వహించిన బహిరంగ వేలం పాటలో ఒక్కో షాపు నెలకు రూ.2,500 అద్దెకు పాడుకున్నారు. దేవస్థానం ఏఈవో పిల్లా శ్రీనివాసరావు, సూపరింటెండెంట్లు నరసింహరాజు, ప్రసన్నలక్ష్మి, సిబ్బంది దొంతల రమణ, కార్తీక్ తదితరులు వేలం పాటలు నిర్వహించారు. కాగా కల్యాణ మండపాలను లీజుకి ఇచ్చే వేలం ప్రక్రియని అధికారులు అర్ధంతరంగా రద్దు చేశారు. బహిరంగ వేలం పాటల్లో కల్యాణ మండపాలను లీజుకు ఇచ్చే అంశం కూడా తొలుత చేర్చారు. దాంతో పలువురు లీజు హక్కుని సొంతం చేసుకునేందుకు వచ్చారు. కానీ కల్యాణ మండపాల లీజు ప్రక్రియని రద్దు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారు. ఈ అంశంపై పలువురు పాటదారులు అధికారులను ప్రశ్నించారు. తాను పది లక్షల డీడీ తీసుకుని నిబంధనల ప్రకారం టెండరు వేశానని, టెండరు పత్రాలు బాక్స్‌లో వేశాక రద్దు చేస్తున్నట్టు అధికారులు ప్రకటించారని, ఈవిషయంపై అధికారులు వివరణ ఇవ్వాలని పత్రికా ముఖంగా దిలీప్‌కుమార్ అనే పాటదారు పేర్కొన్నాడు. కాగా దేవస్థానం ఈవో ఆదేశాలతోనే కల్యాణ మండపాల లీజు ప్రక్రియని అధికారులు తాత్కాలికంగా రద్దు చేసినట్టు తెలుస్తోంది.

పేదలకు దుప్పట్ల వితరణ

గాజువాక: సినీ నటుడు బనవోలు ప్రసన్న కుమార్ గాజువాకలోని వివిధ ప్రాంతాల్లో పేదలకు దుప్పట్లు, రగ్గులు పంపిణీ చేశారు. తన తల్లి వర్ధంతి సందర్భంగా బుధవారం ఆయన రోడ్డు పక్కన గడుపుతున్న వృద్ధులు, పేదలకు దుప్పట్లతో పాటు భోజనం ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జన చైతన్య శ్రీనివాస్, టి.కుమార్, పినిశెట్టి రమేష్, పి.సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

పశువులకు సోకే వ్యాధుల పట్ల అప్రమత్తం



వాల్‌పోస్టర్లు ప్రదర్శిస్తున్న పశువైద్య సిబ్బంది

పరవాడ: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఉచిత పశు వైద్య శిబిరాలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని పరవాడ పశు సంవర్ధక శాఖ ఏడీ రామకృష్ణ కీర్తి పిలుపునిచ్చారు. నక్కవానిపాలెం, చింతల గొర్లివానిపాలెం గ్రామాల్లో బుధవారం ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాల్లో పాల్గొని మాట్లాడారు. పశువులకు సోకే వ్యాధుల పట్ల పాడి రైతులు అప్రమత్తంగా వ్యవహించి సమీప పశు వైద్య కేంద్రాలకు తీసుకెళ్లి వైద్యం అందించాలని సూచించారు. నక్కవానిపాలెం, గొర్లివానిపాలెం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఉచిత పశు వైద్య ఆరోగ్య శిబిరాలకు వచ్చిన 247 పశువులకు నట్టల నివారణ మందులు తాగించి వ్యాధి నిరోధక టీకాలు, గర్భకోశ వ్యాధులకు చికిత్సతో పాటు గర్భ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. వైద్య శిబిరాల్లో వాడచీపురుపల్లి, లంకెలపాలెం పశు వైద్యులు సురేష్‌కుమార్, అశ్విని ప్రఫుల్లా, పశు సంవర్ధక శాఖ సహాయకులు బాలాజీ, భాస్కర్, పద్మ, నూకరత్నం, లక్ష్మణ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గంగునాయుడు తదితరులు

సబ్బవరం: పశు వైద్య శిబిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యులు డాక్టర్ బి. సంధ్య కోరారు. మండంలోని మల్లునాయుడుపాలెంలో బుధవారం నిర్వహించిన పశు వైద్య శిబిరాన్ని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు బోను గంగునాయుడు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో అనారోగ్యంతో బాధపడుతున్న పలు పశువులకు వైద్య పరీక్షలు నిర్వహించారు. 23 పశువులకు గర్భకోశ వ్యాధికి చికిత్స అందించారు. 10 చూడి ఆవులకు తనిఖీలు చేశారు. 48 లేగ దూడలకు నట్టల నివారణ మందులు అందజేశారు. గొర్రెలకు నట్టల నివారణ మందులు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ గండి దేముడు, ఎంపీటీసీ సభ్యుడు గొర్లి కనకరాజు, డాక్టర్ జి. అరుణ, వీపీ లక్ష్మణరావు, పశు సంవర్ధక శాఖ సహాకులు ఎ. రమేష్, డి. రమేష్, సబ్బవరపు రవి, దేముడుబాబు, సబ్బవరపు సత్యం తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



భూసార పరీక్షల కోసం మట్టి నమూనాలు సేకరిస్తున్న విద్యార్థులు

పెందుర్తి: జిల్లా వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నరవ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు భూసార పరీక్షలు, మట్టి నమునాల సేకరణపై బుధవారం అవగాహన కలిగించారు. ఈ సందర్భంగా జిల్లా సంచార భూసార పరీక్ష సహాయ సంచాలకుడు టి.దాసు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే వ్యవసాయం, భూసార పరీక్షల గురించి పిల్లలకు తెలియజేయాలన్న ఆలోచనతోనే ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన కల్పించారు. మట్టి నమూనాలు సేకరించే విధానాన్ని విద్యార్థులకు నేర్పించారు. జిల్లా వనరుల కేంద్రం సహాయ సంచాలకుడు జి.హరికృష్ణ, మండల వ్యవసాయాధికారి టి.దుర్గాప్రసాద్, పాఠశాల హెచ్ఎం కె.ప్రసాద్, రైతులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా తీర్థ మహోత్సవాలు



గుండాలమ్మను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే పంచకర్ల, స్థానిక నాయకులు

పరవాడ: పరవాడ గ్రామంలో కొలువుదీరిన రెడ్డివారి గుండాలమ్మ తీర్థమహోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు గుండాలమ్మ అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో భాగంగా సంతబయలులో ఏర్పాటు చేసిన భారీ అన్న సమారాధనను ఆయన ప్రారంభించారు. రాత్రి నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు భక్తులను అలరించాయి. గుండాలమ్మ అమ్మవారిని దర్శించుకున్న వారిలో రాష్ట్ర సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఎంపీపీ పైల వెంకట పద్మలక్ష్మి, మాజీ జెడ్పీటీసీ సభ్యుడు పైల జగన్నాథరావు, సర్పంచ్ సిరపరపు అప్పలనాయుడు, మాజీ సర్పంచ్‌లు చుక్క రామునాయుడు, పైల అప్పారావు, రావాడ, ఈ.బోనంగి సర్పంచ్‌లు మోటూరు సన్యాసినాయుడు, బొద్దపు శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు రెడ్డి శ్రీనివాసరావు, కన్నూరు వెంకటరమణ, బొద్దపు అయ్యబాబు, పైల రామచంద్రరావు, వర్రి పరదేశినాయుడు, సుందరపు శ్రీనివాసరావు, శివ తదితరులు ఉన్నారు.



మొగలిపురంలో సీతారాములను దర్శించుకుంటున్న రవికుమార్ తదితరులు

మొగలిపురంలో సీతారాముల తీర్థం..

సబ్బవరం: మండలంలోని మొగలిపురం గ్రామస్తుల ఆరాధ్యదైవం శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. వేకువ జాము నుండి అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా గ్రామంలో నిర్వహించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. స్వామివారిని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు గండి రవికుమార్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆయనతో పాటు స్వామివారిని దర్శించుకున్న వారిలో పార్టీ మండల యువజన విభాగం అధ్యక్షుడు యడ్ల నాయుడు, ఉప సర్పంచ్ సిరపరపు వాసు, కరక రాము, గురి శ్రీనివాస్, గోతిరెడ్డి అమ్మతల్లి, పైల రామునాయుడు తదితరులు ఉన్నారు.

ప్రధాని ప్రకటించే వరకూ పోరాటం ఆగదు

ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు



శిబిరంలో నినాదాలు చేస్తున్న కార్మికులు

అగనంపూడి: విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వ రంగ సంస్థగా కొనసాగిస్తామని, ప్రైవేటీకరణ చేయబోమని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటన చేయాలని, అప్పటి వరకు ఉద్యమాలు, ఆందోళనలు ఆగవని విశాఖ ఉక్కు పరిరక్షణ కమిటీ నాయకులు వి.శ్రీనివాసరావు, బీఎస్‌రాజు, రమణమూర్తి, డి.వి. రమణారెడ్డి, కారు రమణ అన్నారు. ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కూర్మన్నపాలెం కూడలిలో మంగళవారం చేపట్టిన 1441వ రోజు రిలే దీక్షా శిబిరంలో వారు మాట్లాడారు. 2021 జనవరి నాటికి రూ.28వేల కోట్ల టర్నోవర్, రూ.940 కోట్ల నికర లాభంతో నడుస్తున్న విశాఖ ఉక్కును కేంద్ర ప్రభుత్వ విధ్వంసకరమైన కుట్రలు, కుతంత్రాలతో 7.3 మిలియన్ టన్నుల సామర్థ్యంతో నడిచే శక్తి ఉన్న విశాఖ ఉక్కును 1.5 మిలియన్ టన్నుల ఉత్పత్తికి దిగజార్చిందని ఆరోపించారు. ప్రభుత్వాల తీరు కత్తితో పొడిచి ఆయింట్‌మెంట్ పూసినట్టు ఉందని, ఈ ప్యాకేజీ కూడా ఇదే కోవకు చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం తీరు మార్చుకొనేలా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు ఒప్పించాలని, ఆ బాధ్యత తీసుకుంటామని, ఎన్నికల ముందు వాగ్దానాలు చేశారని, విస్మరిస్తే ప్రజలు క్షమించబోరన్నారు. కార్యక్రమంలో దాసరి శ్రీనివాసరావు, రాపాటి కోటేశ్వరరావు, సీహెచ్.సన్యాసిరావు, పోతయ్యరెడ్డి, నగేష్, సత్యారావు, అప్పలరెడ్డి, జగదీష్‌కుమార్, పోలీస్‌నాయుడు పాల్గొన్నారు.

ఆదాయార్జనలో స్టీల్‌సిటీ డిపో టాప్

ఉక్కునగరం: కూర్మన్నపాలెంలోని స్టీల్ సిటీ డిపో ఈనెల 20న రాష్ట్రం మొత్తంలో అత్యధిక ఆదాయం సాధించింది. ఆ రోజు డిపోకు చెందిన బస్సులు 24,624 కిలో మీటర్లు తిరిగాయి. తద్వారా రూ. 17,98,000 ఆదాయం సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా పరిశీలిస్తే కిలోమీటర్ ఆదాయం రాష్ట్రంలోనే అత్యధికంగా రూ. 73.04 సంపాదించారు. అదే విధంగా ఆక్యుపేషన్ రేషన్ (ఓఆర్)లో రాష్ట్రంలో రెండో స్థానం సాధించారు. బుధవారం డిపోలో జరిగిన కార్యక్రమంలో డిపో మేనేజర్ గౌతమ్ చటర్జీ, అసిస్టెంట్ డిపో మేనేజర్ పి. శ్రీనివాసరావు సిబ్బందిని అభినందించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ మేనేజర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ సిబ్బంది, కండక్టర్లు, డ్రైవర్లు రాత్రి పగలు కష్టపడి కృషి చేయడం వల్లే ఈ విజయం సాధించామన్నారు. డిపోకు చెందిన కార్మిక నాయకులు, సిబ్బంది పాల్గొన్నారు.

రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంతో ఆటలు తగదు



కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న పైడిరాజు

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ రిటైర్డ్ ఉద్యోగుల ఆరోగ్యంతో యాజమాన్యం ఆటలు ఆడుకోవడం తగదని ఉక్కు శ్రామిక సంఘం ప్రధాన కార్యదర్శి బొడ్డు పైడిరాజు అన్నారు. బుధవారం జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ కోసం సర్వీసులో ఉండగా తమ ఆరోగ్యాన్ని త్యాగం చేశారన్నారు. అందులో భాగంగా అనేక రోగాలు తెచ్చుకోవాల్సి వచ్చిందన్నారు. రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమం కోసం నాటి యాజమాన్యాలు పోస్టు రిటైర్‌మెంట్ మెడికల్ స్కీమ్ ప్రవేశపెట్టాయన్నారు.

రూ.1300 చొప్పున భార్యాభర్తలకు ప్రీమియం ఏర్పాటు చేసి ఏడాదికి రూ. 3 లక్షలు వైద్య పొందే సదుపాయం ఉండేదన్నారు. అదే విధంగా అవుట్ పేషంట్‌గా రూ. 8 వేలు బిల్లు పొందే అవకాశం కల్పించారన్నారు. అయితే యాజమాన్యం ఆ ప్రీమియంను 8 రెట్లు పెంచేసి ఏకంగా రూ. 10 వేలు చొప్పున కట్టాలని కొత్త స్కీం తేవడం దుర్మార్గమన్నారు. ఏడాదికి భార్యాభర్తలు రూ. 20 వేలు చెల్లించాలంటే ఆ ఉద్యోగికి వచ్చే పెన్షన్ మెడికల్ ప్రీమియంకే సరిపోతుందన్నారు. వెంటనే యాజమాన్యం కొత్త స్కీమ్‌ను ఉపసంహరించి పాత మెడికల్ స్కీమ్ కొనసాగించాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు కోటేశ్వరరెడ్డి, కరణం సత్యారావు, బొడ్డు రమణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాల్సిందే..

అగనంపూడి: రహదారి భద్రతా నియమాలు పాటించకుండా, అజాగ్రత్త, అదుపు తప్పిన వేగంతో ప్రయాణం చేస్తూ నిత్యం రోడ్డు ప్రమాదాల ప్రాంతంగా పారిశ్రామిక ప్రాంతం మారిపోతుందని అగనంపూడి ప్రాంతీయ ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ ఉష అన్నారు. జాతీయ రహదారి భద్రతా పక్షోత్సవాల సందర్భంగా అగనంపూడి కూడలిలోని శ్రమశక్తి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో బుధవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో చుట్టూ ఖార్ఖానాలు, కర్మాగాలు, చిన్న చిన్న పరిశ్రమలు ఉండడంతో ఎక్కువ మంది ద్విచక్రవాహనాలపై రాకపోకలు సాగిస్తున్నారన్నారు. ఆలస్యం అయిందనో, వేగంగా వెళ్లిపోవాలనో వేగంగా వెళ్తుండడం, భారీ వాహనచోదకులు సైతం సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ, మద్యం సేవించి అదుపు తప్పిన వేగంతో ప్రయాణం సాగిస్తుండడంతో ఈ ప్రాంతంలో నిత్యం రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. దీంతో క్షతగాత్రులుగా మారిపోతున్నారని, దీని వల్ల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని వాహనచోదకులు గుర్తుంచుకొని వాహనాలు నడిపితే రోడ్డు ప్రమాదాలకు అవకాశం ఉండదన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రాజీవ్ సుస్తానా, ఐసీటీసీ కోఆర్డినేటర్ ఎం.వి.రవికుమార్, అగనంపూడి లయన్స్‌క్లబ్ కార్యదర్శి ఎం.జగదీష్, నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, మోటూరి వెంకటరమణ, తలారి వెంకటరమణ, కరణం సన్యాసిరావు, ఆటోయూనియన్ నాయకులు సక్కా గోవింద్, చిన్నబాబు, దేముడు, రమణ, ధర్మరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా స్వచ్ఛతాహీ సేవ



కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్న అసోసియేషన్ ప్రతినిధులు

అగనంపూడి: జీవీఎంసీ 87వ వార్డు తిరుమలనగర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తిరుమలనగర్‌లో బుధవారం స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం చేపట్టారు. కాలనీలోని మదర్ థెరిసా ఉద్యానవనంలోని ఆటస్థలం, వాకింగ్ ట్రాక్‌లో ఆకులు, పిచ్చి మొక్కలు, చెత్తా చెదారం తొలగించారు. పిల్లలు ఆడుకోడానికి వీలుగా, పెద్దలు నడక సాగించడానికి వీలుగా పార్కును తయా రు చేశారు. కార్యక్రమంలో వార్డు శానిటరీ ఇన్ స్పెక్టర్ ఓదూరు అప్పారావు, అసోసియేషన్ ప్రతినిధులు నాగభూషణం, విశ్వేశ్వరరావు, పరమానందం, సన్యాసిరావు, శ్రీరాములు, కామరాజు, రవి, మారయ్య, వసంత్‌రెడ్డి, ధర్మరాజు, పారిశుధ్య కార్యదర్శి సంధ్య పాల్గొన్నారు.